క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగింపు



బొమ్మనహాళ్: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేసిన విషయం తెలిసిందే. కోడ్ తొలగినా విగ్రహాలకు ముసుగు తొలగించకపోవడంపై సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో ప్రధాన రోడ్డు పక్కనున్న వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించారు.

నెల రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

కుందుర్పి: లోఓల్టేజీ సమస్య ఉత్పన్నం కాకుండా దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే కొత్త కనెక్షన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని ట్రాన్స్‌కో ఏఈ జయకృష్ణ తెలిపారు. ఆదివారం విద్యుత్ కనెక్షన్ల క్రమబద్ధీకరణపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కుందుర్పి మండలానికి 140, శెట్టూరు మండలానికి 250 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పక్షం రోజుల్లో ములకలేడులో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తామని త్వరలోనే అల్లాపురం గ్రామంలోనూ కొత్త సబ్‌స్టేషన్ మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు



తనిఖీ విధుల్లో పోలీసులు

బొమ్మనహాళ్: కర్ణాటకలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో బొమ్మనహాళ్ సమీపంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. సరిహద్దు దాటుతున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం, డబ్బు వంటివి తరలకుండా నిఘా ఉంచామన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు

బొమ్మనహాళ్: ఇండియన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో బెట్టింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ జి.శివ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఉరవకొండ: చిన్నముస్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో నిరుద్యోగులకు రెండో విడత స్కిల్ హబ్ శిక్షణను సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ అశ్రఫ్‌అలీ ఆదివారం తెలిపారు. డొమిస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో 2 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు.

చిరుత దాడిలో మేకపోతు మృతి

కళ్యాణదుర్గం: పట్టణంలోని మారెంపల్లికి చెందిన ఎర్రిస్వామి ఆదివారం మేకల మందను అల్లీపీరా కొండపైకి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో చిరుత దాడి చేసి మేకపోతును ఎత్తుకెళ్లి హతమార్చింది. మేకపోతు రూ.8 వేలు విలువ చేస్తుందని ఎర్రిస్వామి తెలిపారు.

తిమ్మప్ప ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న కాపు భారతి

గుమ్మఘట్ట: గోనబావి గ్రామంలో వెలసిన తిమ్మప్ప ఆలయంలో శనివారం నుంచి స్వామివారి ఉత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ సభ్యుడు గోవింద పాల్గొన్నారు.

నృత్యాలు చేసిన మహిళలు



రాయదుర్గంటౌన్: వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా రాయదుర్గంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ సభలో పొదుపు మహిళలు, మెప్మా ఆర్పీలు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. 'రాయలసీమ ముద్దు బిడ్డ మన జగనన్న' అనే పాటకు ఉత్సాహంగా డ్యాన్సు చేశారు.

సంక్షేమమే సీఎం ధ్యేయం



అయ్యంపల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండలంలోని అయ్యంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకొని అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేసి మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. టీడీపీ హయాంలో అధ్వానంగా తయారైన 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వాహనాలను ఆధునికంగా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగ్గా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, వైస్ ఎంపీపీ బీమేష్, సచివాలయ కన్వీనర్ గంగాధర్, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ నాగరాజు, నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, కుమార్, చంద్ర, రిజ్వాన్, అయ్యంపల్లి రామాంజినేయులు, ముత్యాలప్ప, నాగరాజు, గోపాల్, శెట్టూరు సచివాలయాల మండల కన్వీనర్ తిమ్మరాజు పాల్గొన్నారు.

పథకాలపై ప్రచారం చేయండి

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయ కన్వీనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజకీయాలకు అతీతంగా పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గృహ సారథులతో కలిసి గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను అందజేశారు. నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజినేయులు, గంగాధర, పెరుగు తిమ్మరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, రాము, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మెన్ జయం ఫణి, బ్రహ్మసముద్రం కన్వీనర్ బసవరాజు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు అందజేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

కళ్యాణదుర్గం: పట్టణంలోని సీఅండ్‌బీజీఎం చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చి నుంచి టీ సర్కిల్ వరకు ఖర్జూరపు మట్టలను చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు నారాయణ ఫాల్, రోజీ రాజేష్ సువార్త కీర్తనలు ఆలపించారు. పాస్టర్ ఐజయ్య, సువార్తీకులు చల్లా కిశోర్, జోసెఫ్ కిశోర్, సునీల్ కుమార్, జ్ఞాన సుందర్, వినోద్ పాల్గొన్నారు.

కంబదూరు: సీఅండ్‌బీజీ మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ జేమ్స్, సంఘ పెద్దలు ప్రభాకర్, జోసెఫ్‌రెడ్డి, జోయల్,విల్సన్, జయరాజు, కుమార్, బాబు పాల్గొన్నారు.



కంబదూరులో ఈత మట్టలతో క్రైస్తవులు

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గంటౌన్: ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని 75 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 4,847 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖాధికారులు నాగమణి, తిమ్మప్ప, వెంకటేశ్‌బాబు తెలిపారు.

బొమ్మనహాళ్: మండలంలో 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,020 మంది పరీక్షలు రాయనున్నారు.

ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1380మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప తెలిపారు.

శెట్టూరు: మండలం కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. 440 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

గుమ్మఘట్ట: మండలలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 503 మంది విద్యార్థులు హాజరవుతారని ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగమణి తెలిపారు.

సంగమేశ్వర ఆలయం ముస్తాబు

కూడేరు: మండల కేంద్రంలో కొలువైన సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 6న ఉదయం 9.40 గంటలకు మడుగు తేరు, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం దేవాదాయశాఖ అధికారులు జోడు లింగాల ఆలయానికి నూతన రంగులు వేయించడంతో సరికొత్త శోభను సంతరించుకుంది. 5 నుంచి 7వ తేదీ వరకు ఆలయానికి బళ్లారి వాస్తవ్యులు బసన్నగౌడ్ కుమారుడు జీవన్ కుమార్ విద్యుత్ దీపాలతో అలంకరణ చేయనున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి బాబు తెలిపారు.

శేషవాహనంపై జంబుకేశ్వరుడు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారు శేషవాహనంపై కోట వీధి మీదుగా వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా బొడ్డురాయి వరకు ఊరేగింపుగా వెళ్లారు. సోమవారం కైలాస వాహనోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

శివపార్వతుల వైభవం



వ్యాఘ్ర వాహనంపై ఊరేగుతున్న శివపార్వతులు

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వరుడి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శివప్వాతులు వ్యాఘ్ర వాహనంపై ఊరేగారు. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పీర్ల మసీదు వరకు ఊరేగింపు కొనసాగింది. ఈడిగ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు

వజ్రకరూరు: బీజేపీ మండల అధ్యక్షుడిగా పందికుంట గ్రామానికి చెందిన వడ్డే ఆంజనేయులు నియమితులయ్యారు .ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆదివారం నియామకపత్రం అందజేశారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఎఫ్ ఎకాలజీ ఏటీఎల్ ఎర్రస్వామిరెడ్డి, సేంద్రియ వ్యవసాయ కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఓబుళపతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అప్పిలేపల్లి పంచాయతీలో ఏఎఫ్ ఎకాలజీ పర్యవేక్షణలో మెట్ట భూముల్లో సాగుచేసిన పండ్లతోటలను వారు పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, పురుగు మందుల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన నిర్వహించారు. అప్పిలేపల్లి పంచాయతీలో 160 ఎకరాల్లో సేత్రీస్ అనే సంస్థ నిధులతో ఆర్డీటీ పర్యవేక్షణలో బహుళజాతి పండ్లమొక్కలు సాగుచేసి రైతులకు 90 శాతం సబ్సిడీతో మొక్కల పెంపకానికి అన్ని రకాల తోడ్పాటును అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో కుందుర్పి, మలయనూరు, నిజవళ్లి, మహంతపురం పంచాయతీల్లో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయశాఖ, ఆర్డీటీ పర్యవేక్షణలో వివిధ రకాల పంటల సాగుకు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, రైతులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వెన్నుపోటుదారుడు చంద్రబాబు





ఆసరా మెగాచెక్కు అందజేస్తున్న విప్ కాపు, చిత్రంలో ఏపీఐఐసీ చైర్మెన్ మెట్టు గోవిందరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

వేలాదిగా తరలివచ్చిన మహిళామణులు

- మహిళల ఆర్థిక ప్రగతే సీఎం జగనన్న లక్ష్యం
- తోబుట్టువులా ఆశీర్వదించండి
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: పిల్లనిచ్చిన సొంత మామనే వెన్నుపోటుపొడిచి అధికారాన్ని దక్కించున్న దుర్మార్గుడు చంద్రబాబు అని, అలాంటి మోసకారి వ్యక్తి మాటలు నమ్మితే మన గోతిని మనమే తవ్వుకున్న వాళ్లవుతామని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో విప్‌తోపాటు ఏపీఐఐసీ చైర్మెన్ మెట్టు గోవిందరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మెన్ కాపు భారతి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మెన్ భోజరాజ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా డ్వాక్రా సభ్యులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేపట్టారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ కాపు మాట్లాడారు.. రుణమాఫీ పేరుతో రైతులు, డ్వాక్రా అక్క, చెల్లెమ్మలను మోసం చేసిన గజదొంగ చంద్రబాబు అని అన్నారు. ఇంటికో ఉద్యోగం.. రూ.2 కే 20 లీటర్ల శుద్ధ జలం, ఆడపడుచులందరికీ సెల్‌ఫోన్లు, యువతకు ల్యాప్ ట్యాప్‌లు ఎక్కడిచ్చారో చెప్పాలని టీడీపీ నేతలను నిలదీయాలన్నారు. కష్టాల్లో ఉన్న మహిళా సంఘాలను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ రూ.25 వేల కోట్లు ఖర్చుచేశారన్నారు. రాయదుర్గంలో ఈ నాలుగేళ్లలో రూ.830 కోట్లు ప్రజల ఖాతాలకు చేర్చామన్నారు. 3వ విడత ఆసరా ద్వారా రూ.27.23 కోట్లు జమ అయ్యాయన్నారు. జగనన్నను అన్నీ వేళలా ఆశీర్వదించాలన్నారు. టీడీపీకి ఇవే ఆఖరి ఎన్నికలు అవుతాయన్నారు. ఏపీఐఐసీ చైర్మెన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ.. క్యాలెండర్ వారిగా పథకాలు అందించే జగన్ లాంటి ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరన్నారు. 30 ఏళ్ల పాటు జగన్‌ను సీఎంగా చేసుకునే బాధ్యత మహిళలే తీసుకోవాలన్నారు. జెడ్పీ చైర్మెన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. మహిళా పక్షపాతి సీఎం జగన్ అని కొనియాడారు. పొదుపు గుణం మహిళల్లోనే ఉందనే విషయం గుర్తించిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. 2024 ఎన్నికల్లో మహిళలంతా జగన్ వెంటే నడవాలన్నారు. రాయదుర్గంలోనూ కాపు విజయంలో నారీ శక్తి ఏకమవ్వాలన్నారు. పైలా మాట్లాడుతూ.. మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలన్నదే జగన్ లక్ష్యమన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం జగన్ గెలిస్తేనే ఈ పథకాలు ఉంటాయనే విషయం గుర్తించుకోవాలన్నారు. మోసకారి బాబూ.. నిన్ను నమ్మం అని చెప్పి పంపాలన్నారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండన్న, వైకేపీ, మెప్మ కోఆర్డినేటర్లు గంగాధర, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, బోర్‌వెల్ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్ బషీర్, నాయకులు పొరాళ్ల శివ, దిలావర్‌బాషా పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారత దిశగా మహిళలు





వజ్రకరూరులో మెగా చెక్కు అందజేస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్ రెడ్డి, తరలివచ్చిన మహిళలు

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: సీఎం వైఎస్ జగన్ పాలనలో మహిళలు ఆర్థిక సాధికారత దిశగా పయనిస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. వజ్రకరూరులో ఎంపీపీ రమావత్‌దేవి అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన పాల్గొని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్ రెడ్డితో కలిసి పొదుపు సంఘాల మహిళలకు మూడో విడతగా 4 కోట్ల 89 లక్షల 53వేల 536 రూపాయల మెగా చెక్కును అందించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. తర్వాత వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. దేశంలోని ఏపీలో మాత్రమే మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలవుతున్నాయన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమై పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ జగనన్న అమలు చేశారన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు మహిళల పేరుతోనే ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో మహిళా సంఘాలు నిర్వీర్యానికి గురయ్యాయన్నారు. సీఎంపై దుష్టచతుష్టయం చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను మహిళలే తిప్పికొట్టి వచ్చే ఎన్నికల్లో వైఎస్.జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ రూ.5లక్షల మేర లబ్ధి జరిగిందని, రాష్ట్ర చరిత్రలో ఇది సరికొత్త అధ్యాయమన్నారు. జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మెన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, బీసీ విభాగంజిల్లా అధ్యక్షుడు సీపీ. వీరన్న, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, సర్పంచు మోనాలిసా, మార్కెట్ కమిటీ చైర్మెన్ సుశీలమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు డిష్ సురేష్, ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ సుధీర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, ఎంపీటీసీ ఫిరోజ్‌బాను, ఎస్‌పీఓ చైర్మెన్ అమర్‌నాథ్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాకెట్లబాబు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం గుణశ్యాం పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేద్దాం

- విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న విప్ కాపురామచంద్రారెడ్డి, హాజరైన కన్వీనర్లు

రాయదుర్గం: నియోజకవర్గం వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'జగనన్నే' మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విప్ కాపు రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డి హీరేహాళ్ మండలంలోని హిర్దేహాళ్ సమీపాన వ్యవసాయ క్షేత్రంలో అర్బన్‌తో పాటు ఐదు మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు, వలంటీర్లతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. విప్ కాపు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ శ్రమిస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం నెరవేర్చారని గుర్తుచేశారు. ఈ విషయాన్ని ప్రజలందరికీ గర్వంగా చెప్పాలన్నారు. టీడీపీ హయాంలో పచ్చ పార్టీ నాయకులు చేసిన దోపిడీని, ఈ నాలుగేళ్లలో సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధిని ఇంటింటా వివరించాలన్నారు. పార్టీ కుటుంబం లాంటిదని, చిన్న చిన్న విబేధాలు పక్కన పెట్టి ఏకతాటిపై కలిసికట్టుగా నడవాలని సూచించారు.

మొక్కజొన్న పంట దగ్ధం

వజ్రకరూరు: చాబాల గ్రామంలో బోయ లింగన్న అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటకు నిప్పంటుకుంది. 3 ఎకరాల 78సెంట్లలో మొక్కజొన్న సాగు చేయగా ఆదివారం నిప్పంటుకొని ఎకరా విస్తీర్ణంలోని పంట దగ్ధమైందని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. మంటలను ఫైర్ సిబ్బంది అదుపు చేశారన్నారు.



పంట కాలిపోయిన దృశ్యం

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

బొమ్మనహాళ్: లింగదహాళ్ గ్రామంలో శ్రీ అంజినేయస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన చిన్న కుళ్లాయప్ప వృషభాలు 5,500 అడుగులు లాగి మొదటి బహుమతి రూ. 20 వేలు గెలుచుకున్నాయి. విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామానికి చెందిన పుట్టా వేణుగోపాల్‌కు చెందిన వృషభాలు 5,088.6 అడుగులు లాగి రెండో బహుమతి రూ. 15 వేలు, ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన బసన్న వృషభాలు 5,000 అడుగులు లాగి మూడో బహుమతి రూ. 10 వేలు గెలుచుకున్నాయి. పెంచలపాడుకు చెందిన చిన్న భీమలింగప్పకు చెందిన వృషభాలు నాల్గో స్థానంలో, లింగదహాళ్‌కు చెందిన ఎర్రిస్వామి వృషభాలు ఐదో స్థానంలో, దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన వన్నూరుస్వామి వృషభాలు ఆరో స్థానంలో నిలిచాయి.



ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేత

సర్పంచ్‌కు పరామర్శ

ఉరవకొండ రూరల్: అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నెరమెట్ల సర్పంచ్ యోగేందర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆదివారం పరామర్శించారు.

గిట్టుబాటు ధరను వినియోగించుకోండి

కూడేరు: పప్పుశనగకు ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరను రైతులు వినియోగించుకోవాలని మండల ఏఓ నవత సూచించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మార్కెట్లో క్వింటా రూ.4500లోపే ధర ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5335తో కొనుగోలు చేస్తోందన్నారు. పి.నారాయణపురంలో 40 మంది రైతులతో 660 క్వింటాళ్ల పప్పుశనగ కొనుగోలు చేశామన్నారు. ఇంకా సుమారు 600 క్వింటాళ్ల వరకు రైతుల వద్ద ఉందని, విక్రయించడానికి ముందుకు రావాలన్నారు.